నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శుక్రవారం 27 సెప్టెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

జోరుగా ఇసుక దందా

వాగుల నుంచి యథేచ్ఛగా తరలింపు

- రహస్యంగా డంపులు చేసి.. ఆపై పట్టణాలకు తరలింపు
- లారీ లోడ్‌కు రూ. లక్ష వరకు విక్రయం
- అందినకాడికి దండుకుంటున్న మాఫియా
- టాస్క్‌ఫోర్స్ దాడులకు భయపడని వైనం

వాగులో నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

కుమ్రం భీం ఆసిఫాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నది. రాజకీయ అండదండలున్న కొంత మంది నాయకులు దీనినే ప్రధాన వృత్తిగా పెట్టుకొని దందా సాగిస్తున్నట్లు తెలుస్తున్నది. అప్పుడప్పుడూ అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నా.. ఏమాత్రం బెదరని మాఫియా యథేచ్ఛగా స్థానిక వాగుల నుంచి ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నది. రెబ్బెన మండలం గంగాపూర్ వాగు, కాగజ్‌నగర్ మండలంలోని రస్పల్లి వాగు, పెద్దవాగుల నుంచి నిత్యం వందలాది వాహనాల్లో ఇసుకను తరలిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. ఇక రెబ్బెన మండలం లక్ష్మీపూర్, గంగాపూర్ వాగుల నుంచి అయితే ఏకంగా జేసీబీల ద్వారా ట్రాక్టర్‌లలో ఇసుక నింపి ఆపై రహస్య ప్రాంతాల్లో డంపు చేస్తున్నారు. ఆపై అక్కడి నుంచి పొరుగు జిల్లాలతో పాటు హైదరాబాద్‌లాంటి పట్టణాలకు తరలిస్తున్నారు. ఒక లారీ లోడ్‌కు ఇసుకను రూ. లక్ష దాకా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక స్థానిక నిర్మాణాలకు ట్రాక్టర్‌ల ద్వారా నేరుగా తరలిస్తున్నారు. ఒక్కో ట్రిప్పునకు రూ. 1500 వరకు తీసుకుంటున్నారు.

ఒకే రోజు 11 ట్రాక్టర్లు పట్టివేత

జిల్లా కేంద్రం సమీపంలోని పెద్దవాగు నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 11 ట్రాక్టర్లను అధికారులు బుధవారం పట్టుకొన్నారు. గత పది రోజులుగా అనేక వాహనాలను అధికారులు పట్టుకున్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను పట్టుకొని అధికారులు కేసులు పెడుతున్నప్పటికీ దందాకు బ్రేక్ పడడం లేదు. దండుకున్నోడికి దండుకున్నంత అన్న చందంగా వ్యాపారం సాగుతున్నది.

మైలారం టు హైదరాబాద్

- బూర్గు వాగు నుంచి జోరుగా ఇసుక తరలింపు

మైలారం సమీపంలో పోసిన ఇసుక కుప్పలు

నెన్నెల, సెప్టెంబర్26 : మండలంలోని మైలారం బూర్గు వాగు నుంచి జోరుగా ఇసుక తరలిపోతున్నది. గతంలో మైలారం గ్రామం పక్కన ప్రాణహిత-చేవెళ్ల కాలువ పనుల కోసం గతంలో మెఘా కంపెనీ వారు అక్కడ పెద్ద మొత్తంలో ఇసుక డంప్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కాలువ పనులు నిలిచిపోవడంతో అక్కడ ఇసుక డంప్ అలాగే ఉండిపోయింది. దీనిని ఆసరాగా చేసుకొని కొందరు దందాకు తెర లేపారు. వాగులో జేసీబీలు పెట్టి ట్రాక్టర్లలో ఇసుక నింపుతుండగా, ఆ ఇసుకను తీసుకొచ్చి డంప్ పక్కనే కుప్పలు పోస్తున్నారు. మెఘా కంపెనీ వారే ఇసుకను తరలిస్తున్నారని చెబుతూ అక్రమ వ్యాపారం చేస్తున్నారు. పగలు ట్రాక్టర్‌లలో ఇసుకను తరలించి ఓ చోట నిల్వ చేసి.. ఆపై అక్కడి నుంచి లారీల్లో హైదరాబాద్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. డంప్‌యార్డుకు కిలోమీటర్ దూరంలో ప్రభుత్వ ఇసుక రీచ్ ఉంది. పర్యవేక్షణకు వచ్చే అధికారులు ఈ అక్రమ దందాను చూసీచూడనట్లు వ్యవహరించడం గమనార్హం. ఇసుక దందా గురించి అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇసుకను పరిశీలించిన రెవెన్యూ అధికారులు

గ్రామస్తులు అనేకసార్లు ఫిర్యాదు చేయడంతో ఎట్టకేలకు అధికారులు స్పందించారు. గురువారం నెన్నెల ఆర్ఐ సులోచనతో పాటు మైనింగ్ సిబ్బంది మైలారంలోని ఇసుక డంప్‌ను పరిశీలించారు. ఎక్కడి నుంచి ఇసుక తరలిస్తున్నారని.. ఎన్ని ట్రాక్టర్లు నడుస్తున్నాయని వారు గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. జేసీబీతో తోడి ట్రాక్టర్‌లో పోస్తున్నారని చెప్పారు. అక్రమంగా తరలించి డంప్ చేసిన ఇసుకను స్వాధీన పర్చుకుంటామని రెవెన్యూ అధికారులు చెప్పారు.

చీకట్లో కబడ్డీ పోటీలు

- జిల్లాస్థాయి క్రీడల్లో సౌకర్యాలు కల్పించని నిర్వాహకులు
- సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులోనే నిర్వహణ
- ఇబ్బందులు పడ్డ క్రీడాకారులు

కౌటాల, సెప్టెంబర్ 26 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జిల్లా స్థాయి అండర్-17 కబడ్డీ పోటీలు చీకట్లోనే నిర్వహించారు. ఫైనల్ పోటీలు జరిగే సరికి రాత్రి కావడంతో సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులోనే ముగించేశారు. కనీసం విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు పడగా, స్థానికులు నిర్వాహకులపై అసహనం వ్యక్తం చేశారు.

విజేతలు వీరే..

జిల్లా స్థాయి అండర్-17 కబడ్డీ పోటీల్లో 27 బాయ్స్, 21 గర్ల్స్ టీమ్‌లు పాల్గొన్నాయి. బాయ్స్ ఫైనల్స్‌లో కాగజ్‌నగర్ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ విజయం సాధించింది. మొగడ్ధగడ్ ఆశ్రమ పాఠశాల రెండో స్థానంలో నిలిచింది. గర్ల్స్ ఫైనల్స్‌లో ఆసిఫాబాద్ ట్రైబల్ వెల్ఫేర్ విజేతగా నిలిచింది. రెబ్బెన సోషల్ వెల్ఫేర్ రెండో స్థానంలో నిలిచింది. ఆటల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పలువురిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. తాము సెమీస్‌లో గెలిచినప్పటికీ నిర్వహణ కమిటీ సభ్యులు ఆడించలేదని కౌటాలకు చెందిన మయూరీ విద్యాలయం విద్యార్థులు నిరసన తెలిపారు. స్పందించిన కమిటీ సభ్యులు విద్యార్థులను, ఉపాధ్యాయులను సముదాయించి ముగ్గురు విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేయడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గావుడే హన్మంతు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు నారాయణసింగ్, నానాజీ, పీడీలు సాంబశివ రావు, మధుకర్, హరిక్రిష్ణ, జోసెఫ్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్న నిర్వాహకులు

రూ.1551 కోట్లు చెల్లించాలి

- టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ
- డైరెక్టర్ (పా) వెంకటేశ్వర్‌రెడ్డికి వినతి

సింగరేణి డైరెక్టర్ (పా) వెంకటేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 26 : సింగరేణి సంస్థ సాధించిన రూ. 4701 కోట్ల లాభాల నుంచి రూ. 1551 కోట్లు (33 శాతం) కార్మికులకు చెల్లించాలని కోరుతూ గురువారం టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ సింగరేణి డైరెక్టర్ (పా) వెంకటేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేట్ ఉపాధ్యక్షుడు తుమ్మ శ్రీనివాస్, కార్యదర్శి వాసికార్ల కిరణ్, రాసూరు శంకర్, రవికుమార్, కాగితపు విజయ్‌కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ గనులపై కార్మికుల సంతకాలు చేపడుతున్న టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్

కాసిపేట : కాసిపేట గనిపై సంతకాలు సేకరిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు, కార్మికులు

మందమర్రి : మందమర్రి ఏరియాలోని కేకే -5 గనిపై సంతకాలు సేకరిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు, కార్మికులు

33 శాతం వాటా ఇవ్వాల్సిందే..

- టీబీజీకేఎస్ నాయకుల డిమాండ్
- గనులు, ఓసీపీలు, డిపార్ట్‌మెంట్‌లపై కార్మికుల నుంచి సంతకాల సేకరణ

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 26 : సింగరేణికి వచ్చిన వాస్తవ లాభాల నుంచి కార్మికులకు 33 శాతం వాటా కార్మికులకు ఇవ్వాల్సిందేనని టీబీజీకేఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం గనులు, ఓసీపీలు, డిపార్ట్‌మెంట్‌లపై సంతకాల సేకరణ చేపట్టారు. శ్రీరాంపూర్ ఎస్ఆర్‌పీ-1, -3, ఆర్కే-5, ఆర్కే న్యూటెక్, ఆర్కే-7 గనులతో పాటు ఎస్ఆర్‌పీ ఓసీపీపై కార్మికుల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. ఆయా చోట్ల ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, కేంద్ర, స్థానిక నాయకులు, ఇన్‌చార్జిలు రవిచంద్ర, వికాస్, మెడం తిరుపతి, మారం శ్రీనివాస్, సాధుల భాస్కర్, తౌటి సురేష్, వెంకట్‌రెడ్డి, గంగాధర్, సాల్మన్, సిరాజ్‌పాషా, గోపీనాయక్, దుర్గం రవి, జాడి శ్రీనివాస్, పాపిరెడ్డి, రమేశ్, ఎండా లాలా, ఉప్పాల సంపత్, గడ్డం సుధాకర్, సారయ్య, రమేశ్, అన్వేష్‌రెడ్డి, రమేశ్, గొర్ల సంతోష్, రాజునాయక్, బిరుదు శ్రీనివాస్ కార్మికుల వద్ద సంతకాలు సేకరించారు. టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నికర లాభాలు రూ.4701 కోట్లు ప్రకటించి, కార్మికులకు వాటా తక్కువ చూపి కేవలం 16.9 శాతం రూ.796 కోట్లు మాత్రమే ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు.

కాసిపేట గనిపై..

కాసిపేట, సెప్టెంబర్ 26 : మందమర్రి ఏరియాలోని కాసిపేట ఒకటో గనిపై గురువారం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కార్మికులు సంతకాల సేకరణ చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ కార్మికుల సంతకాల సేకరణ చేసి స్థానిక ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తామన్నారు. టీబీజీకేఎస్ సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ వొడ్నాల రాజన్న, సెంట్రల్ కమిటీ సభ్యుడు బెల్లం అశోక్, పిట్ సెక్రటరీ బైరి శంకర్, అప్జలుద్దీన్, బండారి రమేశ్, రవి కాంత్, సతీశ్, సంపత్, వెంకటస్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మందమర్రిలో..

మందమర్రి, సెప్టెంబర్ 26 : మందమర్రి ఏరియాలోని కేకే -5 గనిపై టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ కేంద్ర, ఏరియా నాయకులు జే.రవీందర్, మేడిపల్లి సంపత్, ఓ.రాజశేఖర్, ఈశ్వర్, సీపెల్లి రాజలింగు, బెల్లం అశోక్ పాల్గొన్నారు.

అర్ధరాత్రి దాడి కేసులో ఐదుగురి అరెస్టు

- మంచిర్యాలలో వివరాలు వెల్లడించిన ఏసీపీ రత్నం

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 26 : పట్టణంలో ఈ నెల 23న అర్ధరాత్రి జరిగిన దాడి కేసులో ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఏసీపీ రత్నపురం ప్రకాశ్ తెలిపారు. ఈ మేరకు గురువారం మంచిర్యాల ఏసీపీ కార్యాలయంలో నిందితుల అరెస్ట్‌ను చూపించి వివరాలు వెల్లడించారు. మంచిర్యాలకు చెందిన గడప రాకేశ్ తన అనుచరులతో కలసి దాడులకు పాల్పడుతూ ఆధిపత్యం కొనసాగిస్తున్నాడు. పాత కక్షల నేపథ్యంలో మేర సంజీవ్ గత జూన్‌లో రాకేశ్‌పై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిపై మేర సంజీవ్‌పై కేసులు కూడా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో సంజీవ్‌పై దాడికి పాల్పడితే తమ ఉనికిని కాపాడుకోవచ్చని రాకేశ్ ప్లాన్ చేశాడు. ఈ క్రమంలో 20 రోజుల క్రితం తన అనుచరులు సంపత్, విశాల్‌తో పాటు మరికొంత మందితో సమావేశమయ్యాడు. సంజీవ్‌ను ఎలాగైనా అడ్డు తొలగించి తమ ప్రాబల్యం పెంచుకోవాలని వారిని అతడిపై దాడికి ఉసిగొల్పాడు. ఇందులో భాగంగానే సంపత్, విశాల్ తన అనుచరులతో కలసి ఈ నెల 23న అర్ధరాత్రి 12.30 గంటల ప్రాంతంలో బైపాస్ రోడ్‌లోని కాంగ్రెస్ లీడర్ జగన్మోహన్ రావు ఇంట్లో ఉన్న ఆయన సూపర్ వైజర్ మేర సంజీవ్‌పై దాడికి పాల్పడ్డారు. ఇందులో సంజీవ్, తోటమాలి అబ్దుల్ అఫ్రోజ్, వాచ్‌మెన్ దోమల శంకరయ్యకు గాయాలయ్యాయి. సంజీవ్ తనను తాను కాపాడుకునే క్రమంలో రుద్ర తేజ్, జ్ఞానేశ్వరుకు కూడా గాయాలయ్యాయి. మిగతా వారు తప్పించుకొని పారిపోయారు. ఈ దాడి కేసులో కుంట శ్రీధర్, పులగం నగేశ్, షేక్ అబ్దుల్ రసూల్, ఎండీ అన్వర్ పాషా, జుమ్మాడా పున్నను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. వారి వద్దనున్న కత్తి, కడియం, ప్లాస్ మ్యాప్, ఫోన్లు సీజ్ చేశారు. మిగితా 14 మంది పరారీలో ఉన్నారని, వారిలో కొంతమందిపై రౌడీ షీట్‌లు ఉన్నాయని, మిగతా వారిపై కూడా ప్రస్తుతం రౌడీ షీట్‌లు నమోదు చేస్తామని ఏసీపీ తెలిపారు. ఈ సమావేశంలో సీఐ బన్సీలాల్, ఎస్ఐలు సనత్‌కుమార్, సురేశ్ పాల్గొన్నారు.

మంచిర్యాల అర్బన్ : నిందితుల అరెస్ట్‌ను చూపిస్తున్న ఏసీపీ రత్నపురం ప్రకాశ్

ఆసిఫాబాద్ టౌన్ : నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

చాకలి ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకం

- కలెక్టర్లు కుమార్ దీపక్, వెంకటేశ్ ధోత్రే
- మంచిర్యాల, ఆసిఫాబాద్‌లో ఐలమ్మ జయంతి

నస్పూర్/ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 26 : వీర నారి చాకలి ఐలమ్మ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని కలెక్టర్లు కుమార్ దీపక్, వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం మంచిర్యాల, ఆసిఫాబాద్ కలెక్టరేట్లలో చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్లు మాట్లాడుతూ ఐలమ్మ వర్ధంతి, జయంతిని అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మోతీలాల్ దీపక్ తివారీ, వెనకబడిన తరగతుల సంక్షేమ అధికారి వినోద్‌కుమార్, రజక సంఘం అధ్యక్షుడు బాపు, వెంకటేశం, రాజేశం, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావు, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి సజీవన్, జిల్లా అధికారులు, ప్యాక్స్ అధ్యక్షుడు అలీబిన్ అహ్మద్, జిల్లా రజక సంఘం అధ్యక్షుడు కడతల మల్లయ్య, బీసీ సంక్షేమ సంఘం నాయకులు రూప్ నార్ రమేశ్, వైరగడే మారుతి, నాయకులు వేములవాడ గణపతి, సంతోష్, కడతల సాయి పాల్గొన్నారు.

నస్పూర్ : చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

రైతులే రోడ్డేసుకున్నారు

- స్వయంగా డబ్బులు జమ చేసి మరమ్మతులు
- మాట ఇచ్చి తప్పిన ఎమ్మెల్యే వివేక్‌పై అసహనం

చెన్నూర్ రూరల్, సెప్టెంబర్ 26 : ఎమ్మెల్యే వివేక్ ఇచ్చిన హామీ నెరవేర్చకపోవడంతో చివరకు ఆ ఊరి రైతులే తలాకొంత డబ్బు జమ చేసి రోడ్డేసుకున్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం నాగాపూర్ గ్రామ రైతులకు గోదావరి నది వైపు వ్యవసాయ భూములున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు మొత్తం బురదమయమై అడుగు తీసి.. అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో సుమారు 25 మంది రైతులు రూ. 12 వేలు జమ చేసుకొని ట్రాక్టర్ ద్వారా రోడ్డుకు మరమ్మతులు చేయించారు. సుమారు కిలో మీటర్ మేర మొరం పోసి రోడ్డును బాగు చేసుకున్నారు. గతంలో నాగాపూర్ గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే వివేక్ నిధులు మంజూరు చేయించి నెల రోజుల్లోగా గోదావరి వరకు రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారని, ఇప్పుడు9 నాలుగు నెలలు కావస్తున్నా మా ఊరివైపు కన్నెత్తి చూడ లేదని రైతులు అసహనం వ్యక్తం చేశారు.

మరమ్మతులు చేయిస్తున్న రైతులు

రూ.1000 కోట్ల అవినీతిపై విచారణ జరిపించాలి

- బీఎంఎస్ నాయకుల డిమాండ్
- శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్ ఎదుట ధర్నా

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 26 : కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్(సీఎంపీఎఫ్)లో రూ. 1000 కోట్ల అవినీతిపై సీబీఐ ద్వారా విచారణ జరిపించాలని బీఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఎంఎస్ శ్రీరాంపూర్ ఉపాధ్యక్షుడు నాథాడి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. జీఎంకు వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ నస్పూర్ కాలనీలోని దవాఖానను ఆధునీకరించి ఆల్ట్రా మోడ్రన్ వైద్య పరికరాలు ఏర్పాటు చేయాలని, పూర్తిస్థాయి వైద్యులను నియమించాలని, సింగరేణి నిఖర లాభాల నుంచి కార్మికులకు 33 శాతం వాటా చెల్లించాలని, భూ నిర్వాసిత గ్రామాలను అభివృద్ధి చేయాలని, కార్మికులకు 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్త పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. బీఎంఎస్ నాయకులు రాగం రాజేందర్, గూడ శ్రీకాంత్, రమేశ్, కట్కూరి సతీశ్‌కుమార్, జే తిరుపతి, మల్లయ్య, మహేందర్, పిట్ కార్యదర్శి రామకృష్ణ, నాంపల్లి తిరుపతి, కిరణ్‌కుమార్, విజయ్‌కుమార్, రమేశ్, సురేష్, చల్ల శ్రీనివాస్, బోడకుంట శ్రీధర్, రాజేశం పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్ ముందు ధర్నా చేస్తున్న బీఎంఎస్ నాయకులు

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి

- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు
- లక్షెట్టిపేట పోలీస్‌స్టేషన్ తనిఖీ

లక్షెట్టిపేట, సెప్టెంబర్ 26 : పోలీసులు క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు అన్నారు. గురువారం లక్షెట్టిపేట పట్టణ పోలీస్‌స్టేషన్, సీఐ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలను సీఐ, ఎస్ఐలను అడిగి తెలుసుకున్నారు. సీపీ మాట్లాడుతూ సిబ్బంది క్రైమ్‌రేటు తగ్గేలా సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాశ్, సీఐ అల్లం నరేందర్, ఎస్ఐలు సతీశ్, రామయ్య, పనాస రాజయ్య ఉన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న రామగుండం సీపీ శ్రీనివాసులు